# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 154
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
మార్చి 13, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net





## సాంప్రదాయంగా హోలీ జరుపుకుందాం

**వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్ వాయిస్, క్రైం :** సాంప్రదాయ పద్ధతుల్లో హోలీ పర్వదినాన్ని జరుపుకుందామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రజలకు పిలుపునిచ్చారు. సహజ సిద్ధమైన రంగులను వినియోగించాలని, పండుగను ప్రశాంతవంతమైన వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ముఖ్యంగా ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.

(మిగితా 8లో..)



8లో..

## గల్లీ గల్లీకి బెల్ట్ షాపు

- చిద్రమవుతున్న నిరుపేదల బతుకులు
- ప్రభుత్వ మద్య విమోచన కమిటీ మాజీ డైరెక్టర్ రాందేవ్



2లో..

## రూ.10 లక్షలిస్తా.. మా ఆయనను హత్య చేయండి

- నర్సంపేటలో సంచలనంగా మారిన ఘటన
- పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు



8లో..

## ఏడాదిలోనే రూ.800 కోట్ల నిధులు

- కనీ, వినీ ఎరుగని రీతిలో అభివృద్ధి
- ముఖ్యమంత్రి సభను విజయవంతం చేద్దాం
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి




పాఠకులకు, ప్రకటన కర్తలకు

### హోలీ పండుగ శుభాకాంక్షలు

కావున శుక్రవారం కార్యాలయానికి సెలవు,
పున: దర్శనం శనివారం.
ఇట్లు : మేనేజ్ మెంట్, వరంగల్ వాయిస్



# విజ్ఞాన బాండాగారానికి.. వడివడిగా అడుగులు





- గట్లకానిపర్తిలో గ్రంథాలయం ఏర్పాటుకు శ్రీకారం
- గ్రామ అభివృద్ధి కమిటీ పేరుతో వేదిక
- చదువుతో వెలుగులు నింపేందుకు ప్రణాళికలు

వివరాలు 2లో..

పుస్తకం హస్త భూషణం అన్నారు పెద్దలు.. విద్య లేని వాడు వింత పశువు అన్నారు మరికొందరు.. 3.5 బిలియన్ సంవత్సరాల క్రితం ప్రోటోజోవ, అమీబా రూపంలో మొదలైన జీవరాశి నుంచి నేటి అధునాతన మానవుడి వరకు  వేరు చేసేది ఒక్క చదువు మాత్రమే. మేతావిని మేధావిగా, మనిషిని మనీషిగా మహర్షిగా మార్చే సాధనం చదువు, విజ్ఞానం అని నొక్కి చెప్పవచ్చు. చదువు ప్రాముఖ్యతను గుర్తించిన గట్లకానిపర్తి గ్రామం ప్రజలు అంధకారమనే అజ్ఞానం నుంచి విజ్ఞానం అనే వెలుగు వైపు వడి వడిగా అడుగులు వేస్తున్నారు. ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక అన్న కాళోజీ నారాయణ రావు మాటలకు వారు జీవం పోయాలని భావించారు. గ్రంథాలయాలే రానున్న తరాలకు విజ్ఞాన భాండాగారాలుగా గుర్తించిన గ్రామస్తులంతా తమ గ్రామంలో నూతనంగా గ్రంథాలయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే గ్రామ అభివృద్ధి కమిటీ పేరుతో వేదికను ఏర్పాటు చేసి విజ్ఞానపు సమాజ నిర్మాణానికి బాటలు వేస్తున్నారు.

- వరంగల్ వాయిస్, శాయంపేట

# విజ్ఞాన బాండాగారానికి..
# వడివడిగా అడుగులు

- గట్లకానిపర్తిలో గ్రంథాలయం ఏర్పాటుకు శ్రీకారం
- గ్రామ అభివృద్ధి కమిటీ పేరుతో వేదిక
- చదువుతో వెలుగులు నింపేందుకు ప్రణాళికలు

**వరంగల్ వాయిస్, శాయంపేట :** గట్లకానిపర్తి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటుకు వడి వడిగా అడుగులు పడుతున్నాయి. అందులో భాగంగా గ్రామంలోని యువత 'గ్రామ అభివృద్ధి కమిటీ' పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక అని కాళోజీ నారాయణ రావు చెప్పిన సూత్రానికి కొనసాగింపుగా ఈ సంస్థ ద్వారా గ్రామంలో మొదటగా విద్యాభివృద్ధికి దోహద పడాలని నిశ్చయించుకుని ఆ దిశగా పని చేయడం ప్రారంభించారు. గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి గ్రామస్తుల్లో, విద్యార్థుల్లో పఠన అభిలాషను పెంచడానికి కృషి చేస్తున్నారు. తద్వారా గ్రామం నుంచి ప్రపంచ మేధావులను తయారు చేయాలనే గొప్ప సంకల్పంతో ముందుకు వెళ్తున్నారు. ప్రస్తుత టెక్నాలజీ యుగంలో సెల్ ఫోన్ కే పరిమతమవుతున్న యువతలో జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహద పడనున్నారు.





### ముందుకు వస్తున్న దాతలు..

మానవ సేవే మాధవ సేవ.. అనగా ప్రజలకు సేవ చేస్తే పరమాత్ముడికి సేవ చేసినట్టు అని అర్థం.. ఆ విధంగా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం మేరకు నిరుద్యోగులకు గ్రంథాలయం ఏర్పాటు అత్యంత ఆవశ్యకం అని గుర్తించిన గ్రామ యువత నడుం బిగించింది. ఇందుకోసం కంకణ బద్ధులైన గ్రామ అభివృద్ధి కమిటీ దాతల కోసం పిలుపునివ్వగానే అత్యల్ప కాలంలో, సహజంగానే సామాజిక సేవ గుణం కలిగిన గ్రామ వాస్తవ్యులు,పెద్దలు, యువకులు, స్త్రీలు ప్రతి ఒక్కరూ దాతలుగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు.

### పుస్తకాల దాతృత్వం..

కూలీ కైకిలి చేసుకునే శ్రామిక జీవులు, రైతులు మొదలుకొని గ్రామం నుంచి ఉన్నత శిఖరాలకు ఎదిగిన ఎంతో మంది మహానుభావులు వారి వారి శక్తి సామర్థ్యాల మేరకు గ్రంథాలయ నిర్మాణం కోసం రాజ్యాంగం ప్రతులు, పుస్తకాలు, గ్రూప్-1, గ్రూప్-2 మెటీరియల్, కుర్చీలు, బల్లలు, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు, రాక్స్, ఇసుక, సిమెంట్, ఇటుక, రేకులు, సైన్ బోర్డులు, మహనీయుల చిత్రపటాలు, ఇంకా వారి వారి వృత్తులను బట్టి పెయింటింగ్ పనులు, ఎలక్ట్రికల్ పనులు, మేస్త్రీ పనులు, ఇంకా మరెన్నో స్వచ్ఛందంగా వితరణ చేయడానికి ముందుకు రావడం ఆదర్శనీయం. గ్రామం వెలుపల నుంచి కూడా వివిధ ప్రభుత్వ కార్యాలయాల నుంచి పుస్తకాలు దాతృత్వం చేయడం హర్షణీయం.

### విజ్ఞానపు కాంతి పుంజాలను అందిద్దాం..

పంచే కొద్ది పెరిగేది విద్య ఒక్కటే.. కాబట్టి, గట్ల కానిపర్తి గ్రామంలో మొదలైన ఈ మహోన్నత కార్యక్రమం ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఎదుగుతూ సమాజంలో విజ్ఞానపు కాంతి పుంజాలు ప్రసరింపజేయాయాలని, లండన్ లైబ్రరీలో పుస్తకాలు చదివి రాజ్యాంగం రాసిన అంబేడ్కర్ లా, చల్లగరిగె గ్రామంలో గ్రంథాలయంలో సాహిత్యాన్ని చదివి ఆస్కార్ వేదిక ఎక్కిన మొదటి తెలుగు వ్యక్తి సినీ పాటల గేయ రచయిత చంద్ర బోస్ లా.. ఎందరో మేధావులను తయారు చేయాలని ఆశిద్దాం.. యజ్ఞంలా సాగుతున్న ఈ మహోన్నత గ్రంథాలయం అనే దేవాలయ నిర్మాణానికి ప్రభుత్వం తరుపున ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, అధికారులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మండల అధికారులు, స్థానిక నాయకులు, పత్రికా ప్రతినిధులు, అన్ని వర్గాల వారు సహకరించాలని గ్రామ యువత, గ్రామ ప్రజలు, గ్రామ అభివృద్ధి కమిటీ కోరుతోంది.

## రూ.10 లక్షలిస్తా..
# మా ఆయనను హత్య చేయండి

- నర్సంపేటలో సంచలనంగా మారిన ఘటన
- పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** మొన్నటికి మొన్న వరంగల్ లో ఒక డాక్టర్ ప్రేమించి పెండ్లి చేసుకున్న భార్యే సుపారి ఇచ్చి పాశవికంగా హత్య చేయించిన సంఘటన మరువక ముందే నర్సంపేట మండలానికి చెందిన ఒక బ్యాంక్ ఉద్యోగిని కట్టుకున్న భార్యే కడతేర్చేందుకు సుపారి అందజేసిన సంఘటన సంచలనంగా మారింది. వివరాల్లోకి వెలితే..నర్సంపేట మండలం ఆకుల తండా గ్రామానికి చెందిన యువకుడు హైదరాబాద్ లోని ఓ ప్రభుత్వ రంగ బ్యాంకులో పీఓగా విధులు నిర్వహిస్తున్నాడు. ఏడేళ్ల క్రితం నర్సంపేట పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. వీరికి ఒక పాప జన్మించినట్లు సమాచారం.

### రూ.10 లక్షలకు డీల్..

ఇదిలా ఉండగా కొన్ని రోజుల కిందట సదరు బ్యాంక్ ఉద్యోగికి ఒక అగంతకుడు కాల్ చేసి రూ.3 లక్షలు ఇస్తే నీకు విలువైన సమాచారం ఇస్తానంటూ ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. మొదట ఈ విషయాలను పెద్దగా పట్టించుకోకున్నా తర్వాత అతను చెప్పిన విషయాలు విని కంగారు పడ్డట్లు తెలియవచ్చింది. విషయం కుటుంబ సభ్యులకు చెప్పడంతో భయపడిన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. సదరు కాల్ చేసిన యువకుడిని ట్రాప్ చేసి విచారణ చేపట్టడంతో అసలు విషయం బయటకు వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. సదరు మహిళ తన భర్తను హత్య చేసేందుకు రూ.10 లక్షలతో డీల్ కుదుర్చుకున్నట్లు పోలీస్ విచారణలో బయటపడింది. ఇందులో ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున మొదటి దఫా వాయిదాలు చెల్లించిన విషయాన్ని ఒప్పుకున్నట్లు సమాచారం.

### పండుగలోపే హత్య..

పథకం ప్రకారం హోలీ పండగకు ముందే సదరు బ్యాంకు ఉద్యోగిని హత్య చేసేందుకు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఇందులో అతని భార్య సహా నలుగురు యువకులు పథకం పన్నినట్లు గుర్తించారు. భార్య స్వగ్రామమైన ఆకుల తండాకు చెందిన ఒక యువకుడు ప్రధాన భూమిక పోషించినట్లు పోలీసుల విచారణలో తేటతెల్లమైంది. సదరు యువకుడు ఇచ్చిన సమాచారంతో తొర్రూరుకి చెందిన ఒకరిని, రాయపర్తికి చెందిన ఒకరిని, మహేశ్వరం గ్రామానికి చెందిన మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. హోలీ పండగ లోపు హత్య చేసేలా డీల్ కుదుర్చుకున్నట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే పోలీసులు ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నప్పటికీ పూర్తి వివరాలు మాత్రం వెల్లడించడంలేదు.

# జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం సందర్శన





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇంటర్మీడియట్, పదో తరగతి వార్షిక పరీక్షల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. గురువారం హంటర్ రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల (ధర్మసాగర్)ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ఎలా రాస్తున్నారు.. నీట్, ఎంసెట్ కు దరఖాస్తు చేశారా అని కలెక్టర్ జూనియర్ కళాశాల విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి క్లాస్ రూములకు వెళ్లి విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. వార్షిక పరీక్షల సన్నద్ధత గురించి విద్యార్థినులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాన్ని సందర్శించిన కలెక్టర్ అందులో ఉన్న వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంసెట్, నీట్ పరీక్షల పుస్తకాలను కళాశాల విద్యార్థినులకు కలెక్టర్ అందజేశారు. వంట గది, స్టోర్ రూమ్ లను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థినులకు వండిన భోజనాన్ని, కూరలను పరిశీలించారు. విద్యార్థినులకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో అల్పాహారం, భోజనం, అందించే మెనూ చార్ట్ ను పరిశీలించారు. విద్యార్థినులకు సంబంధించిన టాయిలెట్స్ ను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థినులకు కలెక్టర్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, ఇతర పరీక్ష సామాగ్రి అందజేశారు. హాల్ టికెట్లను కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఐటీకి స్థల పరిశీలన..

బాసర ట్రిపుల్ ఐటీ ఎక్స్ టెన్షన్ క్యాంపస్ ను ఏర్పాటు చేసేందుకు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములను బాసర ట్రిపుల్ ఐటీ ఇంచార్జి వైస్ ఛాన్సులర్ ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్, హైదరాబాద్ జేఎన్టీయూ విశ్రాంత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్, జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, తహసీల్దార్ జగత్ సింగ్, స్థానిక అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం వీరు హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వివరాలు తెలియజేశారు. తొలుతా యాభై ఎకరాల భూమి కావాలని ప్రతిపాదించగా, భవిష్యత్తు అవసరాల కోసం మరో 50 ఎకరాలు (మొత్తం 100 ఎకరాల భూమి) కేటాయించాలంటూ ప్రాథమిక ప్రతిపాదనలను కలెక్టర్ కు వివరించారు.

# దాడువాయి ఛార్జీలను మార్కెట్ కమిటీ చెల్లించాలి

- రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డికి వినతి
- రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమీడి శ్రీనివాస్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిని సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ సోమీడి శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకొస్తే, అనేక రకాల చార్జీలు వసూలు చేయడం వల్ల ఆర్థిక భారాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. రైతులపై ఈ భారం తగ్గించాలంటే, బస్తాల తూకం వేసే దడువాయి చార్జీలను మార్కెట్ కమిటీలు భరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రైతులు మాత్రమే కాకుండా, కొనుగోలుదారులకు కూడా ఈ తూకం అవసరమే అయినప్పటికీ, పూర్తి భారాన్ని రైతులపైనే మోపడం అన్యాయమన్నారు. కనీసం కొనుగోలు దారుల నుంచి కూడా సగం రుసుము వసూలు చేసే విధానాన్ని అమలు చేయాలని లేదా పూర్తిగా మార్కెట్ కమిటీలే ఈ ఖర్చును భరించాలని సూచించారు. మార్కెట్ లో రైతులు అమ్మిన పంటల ద్వారా కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతోందని, ఈ ఆదాయాన్ని దడువాయి చార్జీల భారం రైతులపై పడకుండా మార్కెట్ కమిటీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులపై ఆర్థిక ఒత్తిడి తగ్గించేందుకు, పంట అమ్మకాల సమయంలో అదనపు ఖర్చులను తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఖర్చులు తగ్గితే రైతులు మరింత సౌకర్యంగా, నష్టపోకుండా తమ పంటను మార్కెట్‌లో అమ్ముకోగలరని శ్రీనివాస్ తెలిపారు.

# లింగాల జోగారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండలంలోని నిడిగొండ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు సింగిల్ విండో డైరెక్టర్ లింగాల జోగారెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో గురువారం ఆయన మృతదేహానికి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయిల్ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు పూలమాలవేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం నాలుగు దశాబ్దాల పాటు పార్టీ కోసం పని చేసిన నాయకుడు లింగాల జోగారెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి సింగపురం ఇందిర తనయుడు ఇమ్మానెయిల్ రాజు, మాజీ ఎంపీపీ వై కుమార్ గౌడ్, లింగాల విష్ణువర్ధన్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు అబ్బాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల జగదీశ్ చందర్ రెడ్డి, మేకల నరేందర్, గంగిడి నరసింహారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, గాదె మహేందర్ రెడ్డి, మండల మాజీ ప్రజాప్రతితులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆజంజాహి మిల్ కార్మిక భవనం కూల్చివేతపై విచారణ



**వరంగల్ వాయిస్, వరంగల్:** ఏజేఎం కార్మిక భవనం కబ్జా వ్యవహారంపై గురువారం అఖిలపక్ష నేతలు వరంగల్ తహసీల్దార్‌ను కలిశారు. గతంలో జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఏజేఎం వర్కర్స్ యూనియన్, దళిత కార్మికులు దరఖాస్తు చేయగా, విచారణలో భాగంగా నేడు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏజేఎం యూనియన్ ఆఫీస్ సంబంధిత అన్ని వివరాలను తహసీల్దార్‌కు సమర్పించారు. అనేక మంది దళిత కార్మికులు, కార్మిక భవనం పరిరక్షణ సమితి నాయకులు సమావేశంలో పాల్గొని, తహసీల్దార్ అడిగిన వివరాలతో పాటు భవనం ఆధారాలను అందజేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని వివరించి, తగిన న్యాయం అందించాలని జాతీయ ఎస్సీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ అర్బన్ జిల్లా బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, ఐఎఫ్ టీయూ వరంగల్ జిల్లా కన్వీనర్ గంగుల దయాకర్, కాశిబుగ్గ జేఏసీ కన్వీనర్ కొనతం కృష్ణ, చెరువుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్, కన్వీనర్ ఆకెన వెంకటేశ్వర్లు, సముద్రాల పరమేశ్వర్, బాకం హరిశంకర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోలేపాక మార్టిన్ లూథర్, బదిలీ కార్మిక సంఘం యూనియన్ ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి యశోద, బాస్కుల హరినారాయణ, గుత్తికొండ రవి, పల్లకొండ సుధాకర్, కొంపెల్లి ప్రవీణ్, తగరం బాబు, నలిగంటి నర్సింగం, జిలకర వీరాస్వామి తదితర దళిత, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అధికారిగా వెంకటనారాయణ సేవలు మరువలేనివి



**వరంగల్ వాయిస్, పరకాల :** మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కె. వెంకటనారాయణ సేవలు చిరస్మరణీయమని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు పేర్కొన్నారు. హనుమకొండ ఉప సంచాలకులుగా ఉన్న డాక్టర్ వెంకటనారాయణ సంయుక్త సంచాలకులుగా పదోన్నతి పొందిన సందర్భంగా ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, డాక్టర్ వెంకటనారాయణ బదిలీ బాధాకరమైనప్పటికీ, ఏప్రిల్‌లో పదవీ విరమణకు ముందు పదోన్నతి పొందడం హర్షణీయమని అభిప్రాయపడ్డారు.మండలంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సమర్థంగా పరిపాలన సాగించారని ఆయన సేవలను కొనియాడారు. డాక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ, పరకాల మండలంలో అనుభవజ్ఞులైన ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో తన బాధ్యతలను సులభతరం చేశారని ప్రశంసించారు. అనంతరం ఎంపీడీఓ, కార్యాలయ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కలిసి ఆయనకు శాలువా, మెమెంటో, గజమాలతో ఘన సన్మానం అందించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు సీహెచ్. శైలశ్రీ, ఏపీఓ ఇందిర, హాస్టల్ వార్డెన్లు అమృతరావు, అందె రవి, పంచాయతీ కార్యదర్శులు వెంకట లక్ష్మణ్, సుమలత, రిజ్వానా, ఫీల్డ్ అసిస్టెంట్లు కోమల తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీ పుస్తకాలు అందజేత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తొలి తెలుగు రామాయణ కర్త మొల్లమాంబ జయంతి సందర్భంగా, బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర నాయకులు, కుమ్మరి కుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవునూరి కుమారస్వామి (బాయికాడి), పేద విద్యార్థులకు విద్యను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఐఐటీ, జేఈఈ, మెయిన్, అండ్ అడ్వాన్స్డ్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఐఐటీ పుస్తకాలను అందజేశారు. ఐఐటీ ఎక్స్ పర్ట్ వనం మహేందర్, గత రెండు నెలలుగా తన ఇంటినే విద్యాలయంగా మార్చి, ప్రభుత్వ కాలేజీల్లో చదువుతున్న ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉచితంగా ఐఐటీ, జేఈఈ, మెయిన్ అండ్ అడ్వాన్స్డ్, నీట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ) కోచింగ్ అందిస్తున్నారు. విద్య అందరికీ చేరాలనే సంకల్పంతో కుమారస్వామి కూడా తన వంతుగా ఐఐటీ జేఈఈ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా, విద్యార్థులు పట్టుదలతో చదివి దేశానికి, సమాజానికి తమ వంతు సేవ చేయాలని ప్రోత్సహించారు. తమకు సహాయం అందించిన కుమారస్వామికి వనం మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 6301040543లో సంప్రదించవచ్చని వనం మహేందర్ పేర్కొన్నారు.

# ఘనంగా రాయపోలు సుబ్బారావు జయంతి వేడుక



**వరంగల్ వాయిస్, సుబేదారి :** ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు విభాగంలో కవి, విమర్శకుడు, జాతీయవాది, కళాశాల తొలి ప్రిన్సిపల్ అయిన ఆచార్య రాయపోలు సుబ్బారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై, రాయపోలు సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ 1948లో ఆర్ట్స్ కళాశాల తొలి ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించిన రాయపోలు సుబ్బారావు ఒక గొప్ప కవి, విమర్శకుడు, జాతీయవాది అని ప్రశంసించారు. ఆయన రచనల్లో అనురాగం, ఆప్యాయతకు ప్రాధాన్యత ఇచ్చారని, నేటి యువత ఆయన ఆదర్శాలను అనుసరించి ముందుకు సాగాలని సూచించారు. తెలుగు విభాగ అధిపతి డాక్టర్ సదాశివ, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రాజు మాట్లాడుతూ రాయపోలు సుబ్బారావు తన రచనల ద్వారా కేవలం భార్యాభర్తల ప్రేమను కాకుండా తల్లి–బిడ్డ అనుబంధాన్ని కూడా హృదయాన్ని హత్తుకునేలా చూపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆదిరెడ్డి, డాక్టర్ హరికుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొని సుబ్బారావు రచనల గొప్పతనాన్ని గుర్తు చేసుకున్నారు.

# రోగులకు పండ్లు పంపిణీ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్ ఆధ్వర్యంలో గురువారం శాయంపేట మండల కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితక్క జన్మదిన పురస్కరించుకొని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం జాగృతి నాయకులు పరకాల ప్రభుత్వ హాస్పిటల్ లో 20 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి శాయంపేట మండల అధ్యక్షుడు, మహమ్మద్ పాషా, యూత్ మండల అధ్యక్షులు మారంపల్లి మోహన్, టీఆర్ఎస్వీ నాయకులు కొమ్ముల శివ, మాజీ సర్పంచ్ ప్రసాద్, మాజీ ఎంపీటీసీ గడప విజయ్, అబు తిరుపతిరెడ్డి, చంద విజేందర్, కోయిల సుమన్, గోపి పాల్గొన్నారు.

## శ్రీ వేద స్కూల్‌లో హోలీ సంబరాలు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** పెద్దకోడపాక గ్రామంలోని శ్రీ వేద పాఠశాలలో గురువారం ముందస్తుగా హోలీ సంబరాలు స్కూల్ ప్రధానోపాధ్యాయుడు విజయ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు జాజిరి ఆటలు ఆడి హోలీ సంబరాల్లో రంగురంగుల కలర్లు చల్లుకొని నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విజయ్ మాట్లాడుతూ విద్యార్థులకు మన సంస్కృతి సాంప్రదాయాల గురించి వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వేద, ప్రియాంక, కీర్తి రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలీల ఐక్యతే విజయానికి మార్గం

### వడ్నాల నరేందర్




**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక జిల్లా సమావేశంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్నాల నరేందర్ మాట్లాడుతూ, పద్మశాలీల ఐక్యత ఎంతో కీలకమని, భవిష్యత్ రాజకీయాల్లో ప్రభావం చూపాలంటే కుల బాంధవులు సమష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్ హాజరయ్యారు. చేనేత కార్మికులు, పద్మశాలి సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాణాసంచా కాల్చి నినాదాలతో నేతలను స్వాగతించారు. సమావేశంలో చేనేత కార్మికుల సమస్యలు, ఇతర సమాజ అభివృద్ధి అంశాలపై చర్చించగా, నూతనంగా నియమితులైన జిల్లా ప్రధాన కార్యదర్శి దిడ్డి రమేష్‌ను ఘనంగా సన్మానించి, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వేణుగోపాల్, సమ్మయ్య, ప్రకాష్, శ్రీనివాస్, పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## నల్లబెల్లి ఎస్సైని సస్పెండ్ చేయాలి

### ఎలక్ట్రానిక్ జర్నలిస్టుల యూనియన్ నేత చుంచు కుమార్

**వరంగల్ వాయిస్, నర్సంపేట :** ప్రజాస్వామ్యానికి నాలుగో ధర్మపీఠంగా నిలుస్తున్న మీడియాపై పోలీసుల జులుం ఎక్కువైందని అఖిల భారతీయ ఎలక్ట్రానిక్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చుంచు కుమార్ ఆరోపించారు. తెలంగాణలో జర్నలిస్టుల పట్ల పోలీసు వ్యవస్థ అవలంభిస్తున్న తీరును చూస్తుంటే, ప్రజాస్వామ్య వ్యవస్థే సంక్షోభంలో పడిందనినిపిస్తోందన్నారు. నల్లబెల్లి ఎస్సై వేధింపుల కారణంగా 'మన దునియా' దినపత్రిక ఎడిటర్ ఆకుల సుధాకర్ ఆత్మహత్యాయత్నం చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు. నల్లబెల్లి ఎస్సైపై తక్షణమే సస్పెన్షన్ విధించాలని, జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, మీడియా స్వేచ్ఛను కాపాడేందుకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని, పోలీసు వ్యవస్థలో అవినీతిని అరికట్టేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలని, పత్రికా స్వేచ్ఛను హరిస్తే, దానిని నేరంగా పరిగణించేలా చట్ట సంస్కరణలు తీసుకురావాలని చుంచు కుమార్ డిమాండ్ చేశారు.



# ఎర్రగట్టు జాతరకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు
- ఐదు రోజులపాటు వేడుకలు
- జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- ఆలయ కార్య నిర్వహణ అధికారి వెంకట్రావు



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** శ్రీ ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ఐదు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. హసన్‌పర్తి మరియు భీమారం గ్రామాలు సమైక్యంగా ఈ ఉత్సవాలను నిర్వహించనున్నాయి. హోలీ వేడుకల అనంతరం భీమారం నుండి అలివేలు మంగ మరియు హసన్‌పర్తి నుండి వెంకటేశ్వర స్వామి విగ్రహాలను ఇనుప చక్రాల రథాలపై ప్రతిష్టించి, భారీ ఊరేగింపుగా ఎర్రగట్టు గుట్ట కళ్యాణ మండపానికి తీసుకువస్తారు. శుక్రవారం రాత్రి 11:48 గంటలకు హస్త నక్షత్ర యుక్త వృశ్చిక లగ్న పుష్కరాంశ సుముహూర్తంలో స్వామివారి కళ్యాణం నిర్వహించి, అనంతరం విగ్రహాలను ఎర్రగట్టు గుట్ట గుడిలో ప్రతిష్టిస్తారు. శనివారం సాయంత్రం చిన్న చక్రముల బండ్లు తిరుగుట జరుగుతుంది. ఆదివారం విశేష పూజలు, కుంకుమార్చనలు, హారతి, ప్రసాద వినియోగం నిర్వహించబడతాయి. సోమవారం స్వామివారికి క్షీరాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేస్తారు. మంగళవారం ఉదయం 6 గంటలకు స్వామివారి ఇనుప చక్రాలపై ఊరేగింపు నిర్వహించి, భీమారం, హసన్‌పర్తిలో వేంచేపు చేయనున్నట్లు ఆలయ అర్చకులు వేదాంతం పార్థసారథి చార్యులు, ఆరుట్ల శ్రీనివాసచార్యులు తెలిపారు.





# సరస్వతి పుష్కరాల పనుల్లో వేగం పెంచాలి

### ➲ కలెక్టర్ రాహుల్ శర్మ



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** సరస్వతి పుష్కరాల పనుల్లో వేగం పెంచాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం ఈ ఓ కార్యాలయంలో ఎస్పి కిరణ్ ఖరేతో కలిసి పుష్కరాలు సందర్భంగా చేపడుతున్న పనులపై పంచాయతీ రాజ్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూ ఎస్, వైద్య, దేవస్థానం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సరస్వతి పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేసే దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆధ్వర్యంలో మహాదేవపూర్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సంబంధిత శాఖల అధికారులతో పుష్కరాల పనుల పురోగతిపై చర్చించారు. ఏప్రిల్ 25 వరకు అన్ని పనులు పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయాలని, ముఖ్యంగా ఘాట్లు, రోడ్లు, తాగునీటి సదుపాయాలు, శానిటేషన్ పనులను నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని, పనుల పురోగతిపై వారంతా సమీక్ష నిర్వహించాలని సూచించారు. అనంతరం వివిఐపీ ఘాటును పరిశీలించిన కలెక్టర్, అక్కడి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎస్పీ కిరణ్ ఖరే భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, వాచ్ టవర్ ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను గుర్తించి నివేదిక అందజేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇరిగేషన్ ఈఈ తిరుపతి, పంచాయతీ రాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు, దేవస్థానం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వావిలాలలో మార్కెట్ యార్డ్ గోదాంకు గ్రీన్ సిగ్నల్

- ఏఎంసీ చైర్మన్ స్వప్న సదానందంలకు కృతజ్ఞతలు తెలిపిన వానరాసి జాన్

**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** వావిలాల గ్రామంలో కొత్తగా మార్కెట్ యార్డ్ గోదాం నిర్మాణానికి తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబు, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందంలకు వావిలాల గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వానరాసి జాన్ కృతజ్ఞతలు తెలియజేశారు. వావిలాల, నాగారం, గోపాలపూర్, పాపక్కపల్లి గ్రామాల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఒడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు బుధవారం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం ఆధ్వర్యంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో వావిలాల గ్రామంలో గోదాం నిర్మాణానికి తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వావిలాల కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వానరాసి జాన్ హర్షం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని, ప్రస్తుత ప్రజా ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా, సన్నపు వడ్లకు రూ.500 బోనస్ అందించడం ప్రజా ప్రభుత్వ ఘనతగా పేర్కొన్నారు. రైతుల సమస్యలను తీర్చేందుకు జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం ప్రత్యేక చొరవ తీసుకున్నందుకు ఆయనకు, అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబు, పాలకవర్గ సభ్యులకు వానరాసి జాన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# హోలీ వేడుకల వేళ.. జాగ్రత్తగా ఉండాలి

- రామప్ప చెరువు సందర్శన నిలిపివేత
- వెంకటాపూర్ ఎస్ఐ జక్కుల సతీష్



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** హోలీ వేడుకలను మండల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని వెంకటాపూర్ ఎస్ఐ జక్కుల సతీష్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మండలంలోని పాలంపేట గ్రామ శివారులో గల రామప్ప చెరువు పరిసరాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జక్కుల సతీష్ మాట్లాడారు. హోలీ పండుగను పురస్కరించుకొని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించటం నేరమని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని, ఎవరైనా మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ప్రమాదాల నివారణలో భాగంగా రామప్ప చెరువు సందర్శన రెండు రోజుల పాటు నిలిపి వేస్తునట్టు తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు ఎలాంటి అల్లర్లు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలను జరుపుకోవాలని సూచించారు. వేడుకలను పురస్కరించుకొని మండలంలో గట్టి బందోబస్త్ చర్యలు ఏర్పాటు చేయనునట్టు ఎస్ఐ పేర్కొన్నారు. అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దన్నారు. అదే విధంగా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో ఈతలు కొట్టెందుకు ప్రజలు వెళ్లోద్దని సూచించారు. ముఖ్యంగా మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ప్రజలు నడుచుకోవాలని కోరారు.

# ప్రశాంతంగా హోలీ వేడుకలు జరుపుకోవాలి

## సీఐ ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి




**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** ప్రశాంత వాతావరణంలో ఇతరులకు ఇబ్బందులు కలగకుండా హోలీ వేడుకలను జరుపుకోవాలని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ హోలీ వేడుకల్లో సంప్రదాయ రంగులు వాడాలని, పండుగలు సంతోషాన్ని నింపాలి కానీ విషాదాన్ని నింప కూడదన్నారు. యువకులు మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని, ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించవద్దని ఆయన అన్నారు. లోతైన చెరువులలో కుంటాల్లో ఈత కొట్టడానికి వెళ్లవద్దని సూచించారు. ఈ సందర్భంగా రూరల్ పరిధిలోని రఘునాథపల్లి, లింగాల ఘనపూర్, చిల్పూర్ మండలం ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# ఎస్ఐ శివకు గ్రూప్-2లో 25వ ర్యాంక్

## సన్మానించిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** గ్రూప్–2 పరీక్షలో ప్రతిభ చూపించి 25వ ర్యాంక్ సాధించిన ఎస్ఐ శివను జిల్లా పోలీస్ అధికారి సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందించి ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, క్రమశిక్షణ, కఠిన సాధన, పట్టుదల ఉంటే ఏ లక్ష్యమైనా సాధించవచ్చని తెలిపారు. జిల్లా టౌన్ ఎస్సై శివ తన విధులను నిర్వహిస్తూ చదువుపై ఆసక్తి కనబరచి ఉన్నత ర్యాంక్ సాధించడం ఇతర పోలీస్ అధికారులకు ప్రేరణగా నిలుస్తుందని ఎస్పీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ నరేందర్, ఎస్.బీ ఇన్ స్పెక్టర్ చంద్రమౌళి, డీసీఆర్బీ ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ, టౌన్ సీఐ దేవేందర్, ఆర్ఐలు నాగేశ్వరావు, అనిల్, పాల్గొన్నారు.

# ఎస్ఎస్ కే హాస్పిటల్‌లో డయాలసిస్ సేవలు ప్రారంభం




**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ కే హాస్పిటల్ లో గురువారం ఐఎంఏ జనగామ జిల్లా అధ్యక్షుడు డా. బాలాజీ, డాక్టర్ సుగుణాకర్ రాజు, డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ విజ్ఞశ్రీ, డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ వంశీ కలిసి డయాలసిస్ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ కే హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ జనగామ జిల్లాలో ఫ్లోరైడ్ నీటి ఫలితంగా ఎక్కువ మంది కిడ్నీ బాధితులు ఉన్నారని తెలిపారు. ఈ సేవల (డయాలసిస్ ) కోసం హైదరాబాద్, హనుమకొండ వెళ్లి వచ్చే వారు దీని కోసం ఒకరోజు అంతా ప్రైవేటు కారు అద్దెకు తీసుకొని డయాలసిస్ కోసం వెళ్లి వచ్చి అధిక వ్యయం చెల్లించుకునే వారు. ఇదే డయాలసిస్ సౌకర్యం మన ఎస్ఎస్ కే హాస్పిటల్ లో కేవలం 2,500 ఒక సిట్టింగ్ డయాలసిస్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మల్లిగారి రాజు, రామచందర్ మేడ శ్రీను, పీఏసీఎస్ డైరెక్టర్ బొట్ల నరసింగరావు, మారబోయిన పాండు, గిరిమల్ల రాజు, కందుకూరి ప్రభాకర్, పారునంది వెంకట స్వామి, ఉపేందర్, తిప్పారపు విజయ్ కుమార్, పులి శేఖర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు



# సబ్ సెంటర్‌ను రిపేర్ చేయిస్తా



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని ఒకటవ సబ్ సెంటర్ నిర్వహణకు ఇచ్చిన గ్రామ పంచాయతీ భవనానికి వచ్చిన రిపేర్లను వెంటనే చేయిస్తామని పంచాయతీ కార్యదర్శి విజేందర్ అన్నారు. సబ్ సెంటర్ ఏఎన్ఎం ఎ.జ్యోతి, ఆశాలు ఎం.గీత, జి.రామ, ఏ.సుమలత, కే లక్ష్మీల వినతికి స్పందించి పంచాయతీ కార్యదర్శి గురువారం సబ్ సెంటర్ కు వచ్చి పరిశీలించారు. రిపేర్లను గుర్తించి వెంటనే గదిని బాగు చేయిస్తామని పంచాయతీ కార్యదర్శి విజేందర్ హామీ ఇచ్చారు.

# మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండల కేంద్రానికి చెందిన బుర్ర తిరుపతి, బుర్ర రాజయ్య తండ్రి, బీజేపీ సీనియర్ నాయకుడు బుర్ర కనకయ్య ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను గురువారం అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య ఆధ్వర్యంలో జిల్లా మండల నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రపు రాజేందర్, జిల్లా సాంస్కృతిక కార్యదర్శి జన్మ యుగేందర్, పాముకుంట చందర్, శిలాపాక ప్రణీత్, పుల్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# వితంతుపై అఘాయిత్యం చేసిన వ్యక్తి అరెస్ట్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని ఓ గ్రామానికి చెందిన వితంతు మహిళపై అదే గ్రామానికి చెందిన ఓ పత్రికలో విలేకరిగా పనిచేస్తున్న ఆకుల అశోక్ అత్యాచార యత్నం చేశారని చెన్నారావుపేట ఎస్ఐ రాజేష్ రెడ్డి తెలిపారు. బుధవారం మహిళ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అఘాయిత్యానికి పాల్పడ్డారని వివరించారు. దీంతో మనస్థాపానికి గురైన వివాహిత ఆత్మహత్యయత్నం చేసుకుందన్నారు. కుటుంబ సభ్యులు మహిళను చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రాథమిక విచారణ చేపట్టిన నెక్కొండ సీఐ శ్రీనివాస్ ఆకుల అశోక్ పై రేప్ కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు వెల్లడించారు.

# గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి

- మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** గ్రామస్తుల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ఆత్మకూరు మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు అన్నారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలో పలుచోట్ల సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించిన అనంతరం పర్వతగిరి రాజు మాట్లాడారు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి చొరవతోనే గ్రామాల్లో సీసీ రోడ్డు వేయడం జరుగుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రామాల్లో పూర్తి స్థాయిలో గల్లీ గల్లికి సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజ్ నిర్మిస్తామని తెలిపారు. గ్రామ అభివృద్ధికి గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. పదవుల్లో ఉన్న లేకున్నా గ్రామ అభివృద్ధి మాకు ముఖ్యమని రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గుండెబోయిన శ్యామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బరుపట్ల కిరిటీ, మండల యూత్ అధ్యక్షులు తనుగుల సందీప్, మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ ఖాజా, మాజీ వార్డు మెంబర్ కడబోయిన రవియాదవ్, పొదిలా సదయ్య, జిల్లా నాయకులు మార్త కేదారి, వడ్డేపల్లి ప్రసాద్, గంగినేని సతీష్, కోలా రాంపాల్, తాళ్ల కిరణ్, నాగెల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, మార్చి 13, 2025

# రెండవ దఫా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులపై సర్వే పూర్తి చేయాలి

**వరంగల్ వాయిస్, గణపురం :** గణపురం గ్రామపంచాయతీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండవ దఫా ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు రెండు నెలల క్రితం తీసుకున్న దరఖాస్తులపై వెంటనే సర్వే చేయాలని దరఖాస్తుదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. తీసుకున్న దరఖాస్తులపై సర్వే చేయడానికి సమాయాత్తమవుతున్న క్రమంలో టీచర్లు పట్టభద్రుల నియోజకవర్గాల ఎమ్మెల్సీల ఎన్నికల కోడ్ రాగా సదరు కార్యక్రమం ఆగిందని గుర్తు చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసి ఫలితాలు వెలువడి దాదాపు పది రోజులు కావస్తున్నదని సర్వేపై పంచాయతీ కార్యదర్శిని అడుగగా ప్రభుత్వం ఎప్పుడు ఆదేశం ఇస్తే అప్పుడే చేబడుతామని అంటున్నారని కనుక ప్రభుత్వం రెండవ దఫా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులపై వెంటనే సర్వే చేసి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని దరఖాస్తుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# విద్యార్థులకు కళ్ల జోడుల పంపిణీ



**వరంగల్ వాయిస్, నర్సంపేట:** నర్సంపేట జనరల్ ఆసుపత్రి ప్రొఫెసర్, కంటి నిపుణుడు డాక్టర్ గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో, ఆర్బీఎస్కే టీం బి, పారా ఆప్తాల్మిక్ ఆఫీసర్ రాజేందర్ రెడ్డి సహకారంతో గిర్నిబావి ఎంజేపీటీబీడబ్ల్యూఆర్ఎస్ బాయ్స్ స్కూల్‌లో విద్యార్థులకు గతంలో కంటి పరీక్షలు నిర్వహించారు. గత సంవత్సరం జరిగిన ఈ పరీక్షల్లో, ఆరుగురు విద్యార్థులకు కళ్ల జోడు అవసరమని తేలింది. అందులో, తాజాగా ముగ్గురికి కళ్లద్దాలు అందజేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, విద్యార్థులకు కళ్ల జోడు చాలా అవసరమని గుర్తించినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కళ్లద్దాలతో వారి చూపులో స్పష్టత పెరిగి, చదువుపై మరింత దృష్టి పెట్టగలుగుతారని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఓ. మల్లయ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవీందర్, డాక్టర్ మృదుల, ఏఎన్ఎం దివ్య, శారద తదితరులు పాల్గొన్నారు.

# పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** యువజన కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు ఆధ్వర్యంలో జమ్మికుంట మండలం కొరపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, స్కేళ్లు, విద్యార్థులకు ఉపయోగపడే పలు వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు మాట్లాడుతూ చదువుతోనే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చన్నారు. విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని, 10వ తరగతే భవిష్యత్ కు తొలిమెట్టన్నారు. అదే విధంగా పదవ తరగతి లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ తాళ్లపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బోయిని కుమార్, ఫిషరీష్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పింగిలి రాకేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గంగారపు మహేష్, పోల్సని సంతోష్ రావు, పొన్నం చంద్రమౌళి, దొగ్గల భాస్కర్, కళ్లేపల్లి జంపయ్య, గిరావేనా శ్రీనివాస్, కొండూ భిక్షపతి, పోల్సని సంపత్ రావు, యూత్ కాంగ్రెస్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు పాతకాల రమేష్, ములుపొజు కమలాకర్, అమృత శివ, పురేళ్ల రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



# ఓటర్ల జాబితా సవరణ పకడ్బందీగా జరగాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మార్చి 19 లోపు ఓటర్ జాబితా సవరణ, ఇతర అంశాల పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాల నిర్వహణపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ జిల్లాలో ప్రతి 3 నెలలకు ఒకసారి పకడ్బందీగా అప్ డేట్ కావాలని, నూతనంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక పౌరుడికి ఓటు హక్కు కల్పించాలని అన్నారు. ఓటర్ జాబితా సవరణ, పోటీ చేసిన అభ్యర్థుల వివరాల సమర్పణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాల పై జిల్లా ఎన్నికల అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మార్చి 19 లోపు సమావేశాల నిర్వహణ పూర్తి చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించే సమయంలో మీటింగ్ మినిట్స్ పకడ్బందీగా నమోదు చేసుకోవాలని, సమావేశానికి హాజరైన ప్రతినిధుల సంతకాలను



ప్రత్యేకమైన రిజిస్టర్ లో తీసుకోవాలని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం మినిట్స్ ఇతర వివరాలను మార్చి 27 లోపు ఎన్నికల కమిషన్ కు సమర్పించాలని ఆయన ఆదేశించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో, అదే విధంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రెవెన్యూ డివిజన్ అధికారులు, ఏం.ఆర్.ఓ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో నిర్వహించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో నూతన ఓటరు నమోదు, ఓటు బదిలీ, మరణించిన వారి ఓటర్ వివరాల తొలగింపు వివిధ అంశాలకు వాడే ఫారం 6,7,8 వివరాలను పూర్తి స్థాయిలో వివరించాలన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్లు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీలకు వెదురు అందచేత



**వరంగల్ వాయిస్, ములుగు :** ఎంతో కాలంగా ఎదురు చూస్తూ ఎన్నో వినతుల, ఎన్నో పోరాటలాల ఫలితంగా వెదురు సొసైటీలకు సబ్సిడీతో కూడిన వెదురును తెలంగాణ రాష్ట్రంలో ప్రథమంగా జంగాలపల్లి వెదురు పారిశ్రామిక సహకార సంఘానికి బయ్యక్కపేట వెదురు డిపోలో అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మేదరి సంఘ అధ్యక్షుడు జోరి గల శ్రీనివాస్, గౌరవధ్యక్షులు వెంకటరాముడు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రమాకాంత్ వెదురు సొసైటీల రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి హనుమంత్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు ప్రతాపగిరి శ్రీనివాస్, ప్రతాపగిరి యాదగిరి, కుమార్ మహేంద్ర, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధీర్ కుమార్, ములుగు జిల్లా సంఘ అధ్యక్షులు ఏకుల ధనంజయ, ప్రధాన కార్యదర్శి మహేందర్, సతీష్, రాజేందర్, నవీన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. వెదురు పారిశ్రామిక సహకార సంఘాలకు వెదురు కేటాయించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

# అరుణాచల క్షేత్రంలో చల్లా దంపతులు

**వరంగల్ వాయిస్, పరకాల :** తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచల క్షేత్రంలో అగ్నిలింగ రూపంలో అవతరించిన ఆ పరమేశ్వరుడిని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి–జ్యోతి దంపతులు దర్శించుకున్నారు. మొదటగా గిరి ప్రదక్షణ చేసి అనంతరం స్వామీ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పంచభూత లింగ క్షేత్రాలలో ఒకటిగా అరుణాచలంలో అగ్నిలింగ రూపంలో వెలసిన ఆ పరమేశ్వరుడిని ధరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆ పరమశివుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.



# సకాలంలో పన్నులు చెల్లించండి


**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని 40వ డివిజన్ సీఆర్సీ భవన్‌లో ఇంటి యజమానులను ఉద్దేశించి గురువారం స్థానిక కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడారు. డివిజన్ లోని ఇంటి యజమానులు తమ ఇంటి పన్నులు సకాలంలో చెల్లిస్తే, డివిజన్ అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. ఇంటి యజమానులు మహానగర పాలక సంస్థకు ఆస్తి పన్నుతో పాటు నల్ల పన్ను, చెత్త పన్ను వంటి రకాల పన్నులను చెల్లిస్తే, మన డివిజన్‌కు అధికారులు మరింత నిధులను మంజూరు చేస్తారని, ఆ నిధులతో రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు, మంచినీటి పైపులు వంటి సదుపాయాలను ఏర్పాటు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఇంటి యజమాని, తమ దగ్గరకు వచ్చే మున్సిపల్ బిల్ కలెక్టర్, వార్డు ఆఫీసర్ లేదా మీ సేవ కేంద్రం ద్వారా పన్నులు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో వార్డు ఆఫీసర్ ఎన్.శంకర్, బిల్ కలెక్టర్ రాజ్‌కుమార్, రజిత, హిమబిందు, ఇతర ఇంటి యజమానులు, మహిళలు పాల్గొన్నారు.



# స్థానిక సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తొర్రూరు ప్రాంత ప్రజా సమస్యలను పరిష్కరించాలని వామపక్ష పార్టీలు సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీల ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గురువారం మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు అజయ్ సారథి, చంద్రన్న, రాజమౌళి, తమ్మెర విశ్వేశ్వరరావు, కొత్తపల్లి రవి, బొల్లం అశోక్, మున్సపల్లి వీరన్న, పెరుగు కుమార్, తోట శ్రీనివాస్, పాల బిందెల మల్లయ్య, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.




# 21 సలార్ రీరిలిజ్...

## ప్రభాస్ అంటే ఆమాత్రం కేజ్రీ ఉంటుంది..?

కృష్ణంరాజు నట వారసుడిగా ఇండస్ట్రీలోకి వచ్చిన ప్రభాస్ తన క్రేజ్‌ని అమాంతం పెంచుకుంటున్నాడు. మధ్యలో కొన్ని ఫ్లాపులు పలకరించిన తర్వాత వరసగా హిట్స్ అందుకుంటున్నాడు. బాహుబలి సినిమాతో వరల్డ్ వైడ్ గా అభిమానులను సంపాదించుకున్న ప్రభాస్.. సలార్, కల్కి సినిమాలతో సూపర్ సక్సెస్ అందుకొని తన సత్తా ఏంటో నిరూపించాడు. ఇక ప్రభాస్ తన తర్వాతి సినిమాల లైనప్ చూస్తే దుమ్ము రేపడం ఖాయం. ప్రస్తుతం మారుతితో రాజా సాబ్ అనే సినిమా చేస్తున్న ప్రభాస్.. హను రాఘవపూడి దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నారు. ఆ తర్వాత సందీప్ రెడ్డితో 'స్పిరిట్'.. సలార్ 2, కల్కి 2 చిత్రాలలో నటించనున్నారు. ఇక ప్రభాస్ నటించిన సలార్ చిత్రం ఎంత పెద్ద హిట్టైందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ సినిమా భారీ యాక్షన్ డ్రామాగా రూపొంది ప్రభాస్ అభిమానులకి మంచి ఫీస్ట్ అందించింది. ఇప్పుడు ఈ చిత్రాన్ని మార్చి 21న రీరిలీజ్ చేయబోతున్నారట. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ స్టార్ట్ అయ్యాయి. పది అంటే పది నిమిషాల్లో థియేటర్లో నాలుగు షో టికెట్స్ సేల్ కావడం అందరిని ఆశ్చర్యపరిచింది. హైదరాబాద్ సిటీలోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ థియేటర్లలో సుదర్శన్ హాలులో సలార్ చిత్రం రీరిలీజ్ అవుతుంది. ఈ థియేటర్‌లో సినిమా చూడడం ఒక అనుభూతి మాదిరిగా ఉంటుంది. అందులో ప్రభాస్ సినిమా చూస్తే ఆ థ్రిల్లే వేరు. అందుకే జనాలు సలార్ సినిమా రీరిలీజ్ చూసేందుకు ఎగబడుతున్నారు.



# అనుపమ పరదా సినిమాలో సమంత గెస్ట్‌రోల్ ?

### ఆఆ సినిమా తర్వాత కలిసి ఇద్దరు నటన

మలయాళ ఇండస్ట్రీ నుంచి వచ్చిన అందాల భామ అనుపమ పరమేశ్వరన్ వరుస సినిమాలతో దూసుకుపోతుంది. ఓ వైపు కమర్షియల్ సినిమాలు చేస్తూనే .. మరో వైపు లేడీ ఓరియెంటడ్ సినిమాలతో ఆకట్టుకుంటుంది. అనుపమ పరమేశ్వరన్ ఫిబ్రవరి 1996లో కేరళలోని త్రిసూర్‌లో జన్మించారు. 2015లో అల్ఫోన్స్ పుత్రన్ దర్శకత్వం వహించిన ప్రేమమ్ చిత్రంతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత తమిళం, తెలుగులో వరుస ఆఫర్స్ అందుకుంటూ తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సంపాదించుకుంది. మొన్నటి వరకు సినిమాల్లో పద్ధతిగా కనిపించిన ఈ భామ ఇటీవల గ్లామర్ గేట్లు ఎత్తేసింది. మొన్నామధ్య వచ్చిన టిల్లు స్క్వేర్ సినిమాలో అనుపమ తన అందాలతో కవ్వించింది. సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్లలో ఒకరిగా పాపులర్ అయిన అనుపమ.. ప్రస్తుతం తెలుగులో పరదా అనే చిత్రంలో నటిస్తుంది. అలాగే తమిళంలో మరి సెల్వరాజ్ దర్శకత్వంలో నటుడు ధ్రువ్ విక్రమ్ నటించిన బైసన్ సినిమాలో నటిస్తుంది. అలాగే రీసెంట్ గా అశ్వంత్ మరిముత్తు దర్శకత్వంలో నటుడు ప్రదీప్ రంగనాథన్ జోడిగా డ్రాగన్ అనే చిత్రంలో నటిస్తుంది. సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఇదిలా ఉంటే తాజాగా అనుపమ సినిమా పరదా సినిమాలో ఓ సర్ ప్రైజ్ ఉంటుందని తెలుస్తుంది. పరదా సినిమాలో ఓ స్టార్ హీరోయిన్ కూడా నటిస్తుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఆ హీరోయిన్ ఎవరో కాదు. సౌత్ స్టార్ బ్యూటీ సమంత. ఫిలిం సర్కిల్‌లో వినిపిస్తున్న వార్తల ప్రకారం పరదా సినిమాలో సమంత ఓ కీలక పాత్రలో కనిపించనుందని అంటున్నారు. గతంలో అనుపమ సమంత ప్రధాన పాత్రలో నటించిన అఆ సినిమాలో నటించిన విషయం తెలిసిందే. అనుపమకు ఇదే తెలుగులో మొదటి సినిమా. ఆతర్వాత ఇప్పుడు మరోసారి అనుపమ, సమంత కలిసి స్క్రీన్ పై సందడి చేయనున్నారని అంటున్నారు. మరి ఈ వార్తల్లో వాస్తవమెంత అన్నది తెలియాల్సి ఉంది.








## ఈ గడియారం వేరీ హాట్ గురూ..

జూనియర్ ఎన్టీఆర్ ఆర్ఆర్ఆర్ సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఒక్కో సినిమాకు వందల కోట్ల రూపాయల పారితోషికం తీసుకుంటారు. తారక్ జీవనశైలి చాలా విలాసవంతమైనది. ఎన్టీఆర్‌కు హైదరాబాద్ లో విలాసవంతమైన ఇల్లు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, బెంగళూరు, ముంబై, దుబాయ్ సహా అనేక ప్రదేశాలలో ఆస్తులు ఉన్నాయి. ఆయనకు లగ్జరీ కార్ల పెద్ద సేకరణ కూడా ఉంది. ఎన్టీఆర్ ధరించిన వాచ్ విలువ కోట్ల రూపాయలు. ఎన్టీఆర్ దగ్గర కోట్ల విలువైన గడియారాల సేకరణ ఉంది.అప్పుడప్పుడు ఏదో ఒక రకమైన చాలా ఖరీదైన గడియారాలను ధరిస్తారు. ఎన్టీఆర్ కొత్త లుక్ తో పాటు, ఆయన ధరించిన వాచ్ కూడా చాలా మంది దృష్టిని ఆకర్షించింది. ఈ సినిమాలో జూనియర్ ఎన్టీఆర్ ధరించిన వాచ్ ఖరీదు 7.47 కోట్ల రూపాయలు! ఎన్టీఆర్ రోల్స్ రాయిస్ కారు కంటే ఖరీదైన వాచ్ ధరించాడు. ఎన్టీఆర్ రిచర్డ్ మిల్లె 40-01 టర్బైన్ మెక్‌లారెన్ స్పీడ్‌డయల్ వాచ్ ధరించాడు. భారతదేశంలో దీని ధర 7.47 కోట్ల రూపాయలు. విదేశాల నుండి దిగుమతి చేసుకుని, అన్ని పన్నులు చెల్లించిన తర్వాత, దాని ఖర్చు 8 కోట్లు దాటుతుంది. ఈ వాచ్ చాలా అరుదు. ఈ మోడల్ వాచ్ ప్రపంచవ్యాప్తంగా 106 మాత్రమే ఉన్నాయి. వాటిలో ఒకటి జూనియర్ ఎన్టీఆర్ చేతిలో ఉంది.

## మోహన్‌బాబుపై సంచలన ఆరోపణలు

ఖమ్మం జిల్లా సత్యనారాయణపురానికి చెందిన చిట్టిమల్లు అనే వ్యక్తి నటుడు మోహన్ బాబుపై సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ శివారు జల్‌పల్లి గెస్ట్ హౌస్ ఒకప్పటి హీరోయిన్ సౌందర్యదని.. దాన్ని నిర్మాత మోహన్‌బాబు బలవంతంగా లాక్కున్నారన్నది చిట్టిమల్లు వాదన. ఆ గెస్ట్‌హౌస్‌ను తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని అనాధ ఆశ్రమానికి లేదంటే మిలటరీకి అప్పగించాలని డిమాండ్ చేశాడు. అలాగే మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలంటూ ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌తో పాటు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశాడు. చిట్టిమల్లు ఆరోపణలపై సౌందర్య భర్త రఘు స్పందించారు. సౌందర్య ఆస్తిని మోహన్‌బాబు లాక్కున్నారని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని లెటర్ రిలీజ్ చేశారు. మోహన్ బాబుతో సౌందర్య ఎలాంటి భూ లావాదేవీలు జరపలేదని స్పష్టం చేశారు. పాతికేళ్లుగా రెండు కుటుంబాల మధ్య మంచి అనుబంధం ఉందని.. తమ మధ్య ఎ లాంటి వివాదాలు లేవన్నారు. తాను మోహన్ బాబును ఎంతో గౌరవిస్తానని, తామంతా ఒకే కుటుంబంగా ఉంటామని చెప్పారు. తప్పుడు ప్రచారాలు వెంటనే ఆపాలని లేఖలో కోరారు రఘు.







## అమీర్‌ఖాన్ ఇంటికి వెళ్లిన సల్మాన్, షారూఖాన్‌లు

బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ ఆమీర్ ఖాన్ మార్చి 14న తన 60వ పుట్టినరోజును జరుపుకోనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయనకు ప్రీ బర్త్‌డే విషెస్ తెలుపుతున్నారు సినీ ప్రముఖులు. అయితే ఆమీర్ ఖాన్ 60వ పుట్టినరోజు గుర్తుండిపోయే విధంగా ఉండేందుకు బాలీవుడ్ స్టార్ హీరోలు షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్ అతడికి కలిసినట్లు తెలుస్తుంది. బుధవారం రాత్రి ఆమీర్ ఖాన్‌ని కలిసి అతడి ఇంటినుంచి బయటకు వస్తున్న సల్మాన్, షారుఖ్ వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఒక వీడియోలో సల్మాన్ ఖాన్ అమీర్ ఇంటి నుండి బయటకు వస్తున్నట్లు కనిపించగా.. ఇందులో అమీర్ ను ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు సల్మాన్. ఇంకో వీడియోలో షారుక్ వెళ్లబోతుండగా.. ఆమీర్ షారుక్ ముఖంని కవర్ చేసుకోమని చెప్పడం.. షారుఖ్‌ని సెక్యూరిటీ సిబ్బంది కవర్ చేయడం చూడవచ్చు. కాగా ఇందుకు సంబంధించిన వీడియోలను మీరు చూసేయండి. సినిమాల విషయానికి వస్తే.. సల్మాన్ ఖాన్ ప్రస్తుతం సికందర్ సినిమాలో నటిస్తుండగా.. ఆమీర్ సితారే జమీన్ పర్ అనే చిత్రంలో నటిస్తున్నాడు. షారుఖ్ ప్రస్తుతం కింగ్ అనే ప్రాజెక్ట్‌లో నటిస్తున్నట్లు సమాచారం.



# ఏడాదిలోనే రూ.800 కోట్ల నిధులు

- కనీ, వినీ ఎరుగని రీతిలో అభివృద్ధి
- ముఖ్యమంత్రి సభను విజయవంతం చేద్దాం
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** ఒక్క ఏడాది కాలంలోనే ఒక నియోజకవర్గ అభివృద్ధికి రూ.800కోట్ల నిధులు కేటాయించడం గొప్ప విషయమని, ఇది మన పైన, మన నియోజకవర్గం పైన ముఖ్యమంత్రికి ఉన్న ప్రేమకు నిదర్శనమని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. వేలేరు మండల కేంద్రంలోని రెడ్డి కమ్యూనిటీ హాల్లో గురువారం వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలలోని ఆయా గ్రామాల నుంచి సీఎం సభ జన సమీకరణపై గ్రామాల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. మనం అడిగిన వెంటనే కాదనకుండా నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్న ముఖ్యమంత్రికి మనందరం ధన్యవాదాలు తెలుపాలన్నారు. నియోజకవర్గంలో ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లి మరిన్ని నిధులు మంజూరు చేయించుకుందామన్నారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే మనందరం కలిసికట్టుగా పనిచేసి 16వ తేదీన జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ధర్మసాగర్ లో..

ఈ నెల 16న నిర్వహించనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని సుస్మిత గార్డెన్స్ లో ధర్మసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలవిస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల నుంచి సీఎం సభ జనసమీకరణపై గ్రామాల వారిగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గల్లీ గల్లీకి బెల్ట్ షాపు

- చిద్రమవుతున్న నిరుపేదల బతుకులు
- ప్రభుత్వ మద్య విమోచన కమిటీ మాజీ డైరెక్టర్ రాందేవ్




**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వీధికో బెల్ట్ షాపుతో అనేక నిరుపేద కుటుంబాలు వీధిన పడాల్సి వస్తుందని ప్రభుత్వ మద్య విమోచన కమిటీ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దాసి రాందేవ్ ఆరోపించారు. విచ్చలవిడిగా బెల్ట్ షాపులు పుట్టుకొస్తున్నా అధికారులు పట్టించుకోకపోవిడం దురదృష్టకరమన్నారు. సమస్య మూలాలకు పోయి దాని పరిష్కారం ఆలోచించాలన్నారు. బెల్ట్ షాపులతో ఆకతాయిల బెడద ఎక్కువైందన్నారు. యువత మద్యం తాగి విచక్షణా రహితంగా ప్రవర్తించడంతో స్థానికులకు మనశ్శాంతి కరువైందన్నారు. మద్యపాణంతో చిన్న వయసులోనే మహిళలు భర్తలకు కోల్పోయి వితంతువులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికితోడు డ్రగ్స్, గంజాయి, గుడుంబా, కల్తీ మద్యం యువతను కాటేస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మద్య విమోచన కమిటీని పునరుద్దరించడంతోపాటు బెల్ట్ షాపులను అరికట్టాలని దాసి రాందేవ్ కోరారు.

# సాంప్రదాయంగా హోలీ జరుపుకుందాం

### వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

(**మొదటి పేజీ తరువాయి**) హోలీ అనంతరం యువత స్నానాల కోసం శివారు ప్రాంతాల్లోని చెరువులు, లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దన్నారు. ఒక వేళ వెళ్లాల్సి వస్తే తగు జాగ్రత్తలను పాటించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో అనుమతి లేకుండా వ్యక్తులపై, మహిళలు, యువతులు, వాహనాలపై రంగులు చల్లడం, గుంపులుగా తిరుగుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హోలీ పండుగ నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషరేట్ పరిధిలో ముమ్మర పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ వెల్లడించారు.



# రాజరాజేశ్వరీ అమ్మవారికి..

## లక్ష మల్లెపూల అర్చన

వరంగల్ ఎంజీఎం రోడ్ లోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారికి గురువారం లక్ష మల్లెపూల అర్చన నిర్వహించారు. అదే విధంగా సాయంత్రం అమ్మవారికి 108 పసుపు కొమ్ములు దండలతో పౌర్ణమి పూజ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు లక్ష్మణ్ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**– వరంగల్ వాయిస్, కాశిబుగ్గ**

# డీజీపీని కలిసిన ఎమ్మెల్యే నాయిని

- నూతనంగా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త కొత్త కాలనీలు పుట్టుకొస్తున్నాయని ఈ మేరకు నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) డాక్టర్ జితేందర్ ని కోరారు. గురువారం హైదరాబాద్ లో డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజల భద్రత దృష్ట్యా శాయంపేట, వడ్డేపల్లి పరిధిలో నూతన పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్, ప్రజా రవాణా వ్యవస్థను పటిష్టం చేసేందుకు కాకతీయ యూనివర్సిటీ సర్కిల్ పరిధిలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ఎమ్మెల్యే నాయిని లేఖకు డీజీపీ సానుకూలంగా స్పందించినట్లు ప్రకటించారు.



# 15 నుంచి హాఫ్ డే స్కూల్స్

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఎండాకాలం, తీవ్ర ఉక్కపోత దృష్ట్యా తెలంగాణ రాష్ట్రంలో ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 15 శనివారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ స్కూళ్లు ఉదయం 8 గంటలకు ప్రారంభమై.. మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగనున్నాయి. ఏప్రిల్ 23వ తేదీ వరకు అన్ని స్కూళ్లలో ఈ టైమింగ్స్ అమలు కానున్నాయి. టెన్త్ పరీక్షలు జరిగే స్కూళ్లల్లో మాత్రం మధ్యాహ్నం 1గంట నుంచి 5గంటల వరకు తరగతులు నిర్వహించనున్నామని విద్యాశాఖ అధికారులు తెలుపుతున్నారు.



# స్వామిని తాకిన సూర్య కిరణాలు

గ్రేటర్ వరంగల్ 42వ డివిజన్ రంగశాయిపేటలోని శ్రీ సీతారాచంద్రస్వామి దేవస్థానంలో కొలువై ఉన్న సీతారామచంద్ర స్వామిని గురువారం ఉదయం సూర్య కిరణాలు తాకాయి. దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకులు తిరుమల శ్రీధరాచార్యులు ఉదయం స్వామివారికి పూజ చేస్తున్న సమయంలో స్వామివారి పాదాలపై నుంచి మూలవిరాట్, మొహం వరకు సూర్యకిరణాలు వ్యాప్తి చెందుతూ దర్శనమిచ్చాయి. ఈ దర్శన భాగ్యాన్ని కనులారా చూడడానికి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చినట్లు అర్చకులు వెల్లడించారు. **– వరంగల్ వాయిస్, కరీమాబాద్**

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com